శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో తీవ్ర మురుగు సమస్య

- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా, జీహెచ్‌ఎంసీ
- కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద నాలా పూడిపోయినట్లు గుర్తించిన అధికారులు

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా మురుగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తాత్కాలికంగా చర్యలు తీసుకున్నా సమస్య తీరడం లేదు. దీంతో ఇటీవల ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నేత అమరం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు స్థానికులు ఇటీవల జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో బుధవారం హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఎగువ నుంచి వచ్చే వర్షంనీరు, డ్రైనేజీ నీరు గణేశ్ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న నాలాలో కలుస్తోంది. ఈ నాలా పూర్తిగా మూయడంతో అధికారులు ఎక్స్‌కవేటర్ ద్వారా రెండుచోట్ల నాలా పై భాగాన్ని తొలగించి లోపల మట్టి, రాళ్లను తొలగించారు. అయినా, నీరు వెళ్లక పోవడంతో ఈ నీరు వెళ్లే సమీపంలోని కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉన్న ఔవుట్‌లెట్‌లు పూర్తిగా మట్టితో నిండి ఉండడంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక పోవడంతో వెనకకు వస్తుందని గ్రహించారు. ఇక్కడ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఫ్యాంటలూన్స్ నాలాలోకి వెళ్తుంది. కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద నాలాలో పూడిక పేరుకుపోవడం గుర్తించిన అధికారులు సమస్యను ఉన్నతాధికారులకు వివరించారు. ఇక్కడ వాటర్ పైపులైన్ ఉండడంతో పాటు 11కేవీ విద్యుత్ కేబుల్స్ ఉన్నాయని గుర్తించారు. ఆయా విభాగాల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నట్లు డీఈ మహేష్ తెలిపారు. గణేశ్ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న నాలాలో భారీగా పూడిక చేరిందని, దీనికితోడు ఈ అపార్ట్‌మెంట్ వద్ద పూర్తిగా మూసుకుపోవడంతో నీరు వెళ్లే వీలులేకుండా పోయిందని ఆయన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు అమరం శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, హసిట్‌చర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడారు. నాలాలో పేరుకుపోయిన పూడికతీతకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.



శ్యామ్‌లాల్ బిల్డింగ్ నాలాలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్



వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలతో స్కూల్ నిర్వాహకులు

జబ్బులను ముందే గుర్తిస్తే నయం చేసుకోవచ్చు

ఎర్రగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జబ్బులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఎ.మోహన వంశీ అన్నారు. బుధవారం ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ లెజెండ్స్, ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి, సంస్కార్ ది లైఫ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన మహిళలకు ఈ శిబిరం ఒక అరుదైన అవకాశం అని ఖర్చుల భారం లేకుండా వైద్య నిపుణుల సేవలు పొందే అవకాశం ఉందని అన్నారు. శిబిరంలో పాల్గొన్న మహిళలకు, స్కూల్ బాలికలకు సాధారణ పరీక్షలు, ఈసీజీ, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్కార్ ది లైఫ్ స్కూల్ డైరెక్టర్ ఎ.మధుమతి, రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, బస్తీ మహిళలు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయించిన అధికారులు, ప్రజలు

బస్తీబాటలో సమస్యలు పరిష్కారం

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బస్తీలో పర్యటించి ఎనిమిది విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయించిన అధికారులను బస్తీ ప్రజలు అభినందించారు. ఫిలింనగర్ అంబేడ్కర్ నగర్ రోడ్డు నెంబర్.9 బస్తీలో విద్యుత్ స్తంభాల సమస్య ఉన్నదని అధికారులకు బస్తీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. బస్తీలో పర్యటించిన ఎస్‌ఈ కరుణాకర్ బాబు, డీఈ హన్మంత్‌రెడ్డి, ఏడీఈ రమేష్, ఏఈ పవిత్ర విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు పాల్గొని అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంపు.. కంపు



ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో టాయ్‌లెట్ల పరిస్థితి ఇది. వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజూ పదుల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ఇక్కడ ఆర్‌ఐలు, అధికారులు సమయానికి లేకపోతే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. పొరపాటున ఇక్కడి టాయ్‌లెట్లలోకి ఎవరైనా వెళ్తే ముక్కుపుటాలదిరే దుర్వాసనతో పాటు వాంతులు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయ్‌లెట్లను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

జూబ్లీహిల్స్ అభివృద్ధికి పరితపించిన గోపీనాథ్

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దివంగత శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం పరితపించేవారని ఆయన సతీమణి మాగంటి సునీత అన్నారు. బీఆర్‌ఎస్ షేక్‌పేట డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ సమావేశం బుధవారం జరిగింది. ముందుగా మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టుదల ఉన్న నాయకుడని గుర్తు చేశారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాగంటి గోపీనాథ్ సంతాపసభలో మాట్లాడుతున్న మాగంటి సునీత

చురుకుగా రేషన్‌కార్డుల సర్వే

- ఆగస్టు 10వ తేదీలోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్



ఖైరతాబాద్ వార్డు కార్యాలయంలో దరఖాస్తుదారుల నుంచి పత్రాలు సేకరిస్తున్న రిసోర్స్‌పర్సన్లు

ఖైరతాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల శాఖ చురుకుగా పరిశీలిస్తోంది. పౌరసరఫరాల శాఖ సిబ్బంది, అధికారులతోపాటు జీహెచ్‌ఎంసీ రిసోర్స్‌పర్సన్లు, తహసీల్దార్ కార్యాలయానికి చెందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఈ పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఖైరతాబాద్ సర్కిల్-7 పౌరసరఫరాల శాఖ పరిధిలో ప్రస్తుతం 30 మంది జీహెచ్‌ఎంసీ రిసోర్స్‌పర్సన్లు పనిచేస్తుండగా రెవెన్యూ శాఖకు చెందిన 11 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. వీరికి తోడు పౌరసరఫరాల శాఖకు చెందిన ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. రిసోర్స్‌పర్సన్లు వారికిచ్చిన దరఖాస్తుదారుల నివేదికలో ప్రతీ రోజు కొంతమందికి ఫోన్లు చేస్తూ వారి ఆధార్‌కార్డులు, ఇంటి విద్యుత్ బిల్లులు, గ్యాస్ బిల్లులు తీసుకురావాలని కోరుతున్నారు. అవి తీసుకున్న అనంతరం వాటిని తనిఖీ చేసి పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్‌లకు ఇస్తే వారు సంతకం చేసిన అనంతరం అవి ఏఎస్‌వో కార్యాలయానికి వెళ్లి 360 డిగ్రీల కోణంలో విచారించిన అనంతరం రేషన్‌కార్డులు మంజూరవుతాయి. కాగా, ఇప్పటి వరకు సర్కిల్-7 పరిధిలో 22,409 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా అందులో ఇంకా 11,700 దరఖాస్తులను విచారించాల్సి ఉన్నది. ఇప్పటికే 6,703 మందికి రేషన్‌కార్డులు మంజూరు కాగా, 1,221 మంది దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. దీంతో పాటు 6వేల పైచిలుకు దరఖాస్తులు ఉన్న రేషన్ కార్డుల్లో కొత్త పేర్ల నమోదుకు రాగా, వాటిని సైతం ఆగస్టు 10వ తేదీలోపు పూర్తి చేసి కొత్త పేర్లను రేషన్‌కార్డుల్లో చేర్చుతామని ఏఎస్‌ఓ జ్యోతి తెలిపారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

బోరబండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. రహ్మత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ, బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తా : ఉపేందర్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేస్తానని సిటీ గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కమలాపురి కాలనీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు హైకమాండ్ అవకాశం ఇస్తే పోటీ చేస్తానన్నారు. టీ-హోప్ ఎన్జీవో సంస్థతో జూబ్లీహిల్స్‌లో పనిచేసి పేద మహిళలకు ఆర్థిక తోడ్పాటునందించానన్నారు. కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ కొన్ని స్వీయ తప్పిదాల వల్లనే ఓటమి చెందామన్నారు. ఉప ఎన్నికలో ఈ తప్పిదాలు జరగకుండా అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులకు మేలు

హైటెక్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి కేంద్రం ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్గార్ యోజన పథకంతో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువతకు మేలు జరుగుతుందని సంగారెడ్డి రీజినల్ కార్యాలయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. బుధవారం మాదాపూర్ హైటెక్స్ సమీసపంలోని కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఉద్యోగంలో చేరిన వారు నిరంతరం ఆరు నెలలపాటు విధులు నిర్వహించాలని, అనంతరం పీఎఫ్ సభ్యులైన వారికి కేంద్ర కార్మిక శాఖ ప్రోత్సాహంగా రెండుసార్లు రూ.7,500 చొప్పున రూ.15 వేలు ఇస్తుందన్నారు. సమావేశంలో రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ 2 కమిషనర్లు ఎం.దుర్గా ప్రసాద్, డీజీకే పావని, అనూషరెడ్డి, దిలీప్ మీనా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు అందించాలి

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ డివిజన్ హరిగేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, వెంటనే తాగునీరు అందించాలని మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించగా పాఠశాలలో తాగునీరు లేదని విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ట్యాంకర్ ద్వారా నీరు అందించాలని విజ్ఞప్తి చేయగా అధికారులు సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా మహేష్ యాదవ్ పేర్కొన్నారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీవో.272 సవరణ చేసి అమలు చేయాలని స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, కోశాధికారి జి.చంద్రశేఖర్, సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. వృత్తిపైనే ఆధారపడిన స్వర్ణకార కుటుంబాలు పనులు కరువై రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో మహిళా విభాగం అధ్యక్షురాలు మనోహరమ్మ, సంఘం నాయకులు డి.కిషన్‌రావు, వేణుచారి, ఎం.నాగరాజు, ఐ.రాజు, హరిప్రసాద్, సంతోష్ చారి, రమేష్‌చారి, పి.నాగరాజుచారి, కిషన్, శేఖర్‌చారి పాల్గొన్నారు.



నిమ్స్ యూరాలజీ విభాగంలో 32 ఏళ్లపాటు సేవలందించిన ప్రొఫెసర్ రాంరెడ్డి నేడు పదవి విరమణ పొందనున్నారు. బుధవారం నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాంరెడ్డిని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప సత్కరించారు.

● నిమ్స్, ఆంధ్రజ్యోతి

పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సహకరించండి

ఖైరతాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ ఆలయం పుర్నిర్మాణం కోసం సహకరించాలని స్థానికులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. బుధవారం ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయారెడ్డిని ఎన్‌బీటీ నగర్, బంజారాహిల్స్ డివిజన్ ప్రజలు కలిశారు. పెద్దమ్మ ఆలయాన్ని షేక్‌పేట తహసీల్దార్‌తోపాటు సిబ్బంది, పోలీసులు కూల్చివేయడమే కాక విగ్రహాన్ని అక్కడి నుంచి మాయం చేశారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ పునర్నిర్మాణం చేయించేలా, అమ్మవారి విగ్రహాన్ని అక్కడే ప్రతిష్టించేలా చేయాలని కోరారు. తప్పకుండా తన వంతు సహకారం చేస్తానని విజయారెడ్డి వారికి హామీ ఇచ్చారు. విజయారెడ్డిని కలిసిన వారిలో నాయకులు జి.యాదగిరి, లావణ్య, నవీన్ యాదవ్, రమేష్, విజయ్‌కుమార్ ఉన్నారు.



విజయారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎన్‌బీటీ నగర్, బంజారాహిల్స్ వాసులు

ఎస్టీ జాబితా నుంచి లంబాడీ, సుగాలీ, బంజారా తెగను తొలగిస్తే తిరుగుబాటు

పంజాగుట్ట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీ, సుగాలీ, బంజారా తెగను తొలగించాలని చూస్తే ఊరుకోమని, ప్రభుత్వంపై తండాల తిరుగుబాటు తప్పదని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీ, సుగాలీ, బంజారా తెగను తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్, వారి వెనక ఉండి కుట్రపూరితంగా లంబాడీలపై విషం చిమ్మాలని చూస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లంబాడీలకు వ్యతిరేకంగా కేసు వేసింది రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన అనుచరుడని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కల్యాణ్ నాయక్, రాజు రాథోడ్, భూక్యా రమేష్ నాయక్, రవి రాథోడ్, సక్యనాయక్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

- ఎంఐఎం సోమాజిగూడ డివిజన్ సీనియర్ నాయకుడు ఎర్ర నగేశ్ ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.
- ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డిని యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి సన్మానించారు.
- బోరబండ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, నాంపల్లి)లో విద్యార్థులకు హోదాకు సంబంధించిన బ్యాడ్జీలు, సింబల్స్ అందజేశారు. హెచ్‌ఎం గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో దళిత నాయకుడు యాదయ్య నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.మురళిగౌడ్ సన్నబియ్యం అన్నం తిన్నారు.
- రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఒకటో తేదీన ప్రారంభించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ వెల్లడించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, సర్కిల్-7 ఏఎస్‌ఓ జ్యోతి, విక్రమ్‌కుమార్, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, అధికారులతో కలిసి ఎస్పీఆర్ హిల్స్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కోసం సభా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు.
- లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్ నగర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మోతీనగర్ చౌరస్తాలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ చేకూరు హనుమంతు నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నాగ మల్లేశ్వరరావు, అమరేందర్ రెడ్డి, సుధాకర్, నూకరాజు, డాక్టర్ ప్రఫుల్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోచ్ ఓంకారనాథ్ యాదవ్‌తో బంగారు పతకం గెలుచుకున్న దీప్తి యాదవ్

బాక్సింగ్‌లో దీప్తి యాదవ్‌కు బంగారు పతకం

ఎర్రగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ పోటీలో ఎర్రగడ్డకు చెందిన దీప్తి యాదవ్‌కు బంగారు పతకం లభించింది. ఈ సందర్భంగా ఆమె తండ్రి శివకుమార్ యాదవ్ ఎర్రగడ్డలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అండర్-15 సబ్ జూనియర్స్ స్టేట్ లెవెల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ మధ్య షేక్ పేటలో జరిగాయి. 33 నుంచి 35 కిలోల విభాగంలో 13 సంవత్సరాల కె. దీప్తి యాదవ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఆగస్టు 6 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నమిడాలో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు దీప్తి ఎంపికయ్యారు. ఎల్బీ స్టేడియంలోని బాక్సింగ్ శిక్షణ శిబిరంలో కోచ్ ఓంకారనాథ్ యాదవ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ బి.శంకర్‌లాల్ నగర్ వాసులు దీప్తి యాదవ్‌ను సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపైన వెళ్తున్న వారిని వెనక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో కిందపడిన వారిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన మనోజ్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 13వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో విధులు ముగించుకొని స్నేహితురాలు రుబియాతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ప్యారడైజ్ వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. వెనక కూర్చున్న రుబియాకు బలమైన గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన బైక్ నెంబర్ ఆధారంగా సదరు వ్యక్తికి ఫోన్ చేయగా ఆస్పత్రి ఖర్చులు భరిస్తానని చెప్పాడు. తీరా డిశ్చార్జి అయ్యేటప్పుడు ఫోన్ చేయగా నా వల్ల కాదని చెప్పడంతో మంగళవారం రాత్రి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు చేసిన బైక్ మాయం

యూసుఫ్‌గూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఎదుట పార్కు చేసిన ద్విచక్ర వాహనం మాయమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్ నగర్‌కు చెందిన చందు బంధువైన ఎం.రాజు ఇంటికి 26న వెళ్లాడు. ఇంటి ఎదుట బైక్ పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. బయటకు వచ్చేసరికి బైక్ కనిపించ లేదు. బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్.. యువకుడిపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ ఏఎస్‌ఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ కాలనీకి చెందిన ఎస్.సునీల్ మంగళవారం రాత్రి ఆన్‌లైన్ బెట్టింగ్ కాస్తున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి పెట్రోలింగ్ సిబ్బంది రాకను గమనించిన సునీల్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని విచారించగా ఆన్‌లైన్ బెట్టింగ్ కాస్తున్నట్టు ఒప్పుకున్నాడు. పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగణేష్

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

సికింద్రాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అన్నానగర్‌లోని బీరప్ప ఆలయంలో బీరప్ప, అక్క మహంకాళి దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కురుమ సంఘం ఆహ్వానం మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ఆలయాన్ని సందర్శించి, హోమం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సాద కేశవరెడ్డి, బోయినపల్లి మార్కెట్ మాజీ ఛైర్మన్లు ముప్పిడి గోపాల్, టి.ఎన్.శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్, బిక్షపతిరెడ్డి, మురళి, రవి, ఉడత మహేష్ పాల్గొన్నారు.

న్యూక్లబ్ అభివృద్ధికి సహకరించాలని వినతి

సికింద్రాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లిలోని న్యూ క్లబ్ అభివృద్ధికి సహకరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌కు బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముప్పిడి గోపాల్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా క్లబ్ ఫ్రీ హోల్డ్ అంశం చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని, సీఎంతో చర్చించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ మేరకు శ్రీగణేష్‌కు ఆయన బుధవారం వినతిపత్రం సమర్పించారు. కాగా న్యూక్లబ్ సభ్యుల సంక్షేమానికి తాను ఎప్పుడూ ముందుంటానని శ్రీగణేష్ హామీ ఇచ్చారని ముప్పిడి తెలిపారు.


సీతాఫల్‌మండి కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు పూలమొక్కను అందజేస్తున్న సర్కిల్-9 పౌరసరఫరా అధికారి చాముండేశ్వరి, అధికారులు

అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. సర్కిల్-9 పౌరసరఫరా అధికారి చాముండేశ్వరి నేతృత్వంలో అధికారుల బృందం బుధవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. రేషన్‌కార్డుల జారీ, వెరిఫికేషన్ తదితర అంశాలపై చర్చించారు. కొత్తకార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని, అర్హులందరికి రేషన్‌కార్డులను జారీ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఉత్తేజ్, నాయకులు బెజ్జంకి రాజేశ్, పాకసాయి, మేడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు


హుండీ లెక్కింపులో చైర్మన్ ప్రభాకర్ యాదవ్, ఈవో, పాలకమండలి సభ్యులు

హుండీ ఆదాయం రూ.34.24 లక్షలు

రెజిమెంటల్‌బజార్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్‌రోడ్డులో ఉన్న గణేష్ టెంపుల్ ఆలయ హుండీ ఆదాయం రూ.34,24,868 సమకూరినట్టు ఆలయ ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్ తెలిపారు. బుధవారం నాలుగు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఈవో రామకృష్ణ, పాలకమండలి సభ్యులు ముకేష్ యాదవ్, నరేష్, సాయికుమార్, సంతు, జాజుల క్రాంతి, భిక్షపతి, ప్రభాకర్,నరేందర్, వందన, నందికంటి నాగమణి, ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ నారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాంచందర్, అర్చకులు పాల్గొన్నారు.


ఉత్తరయ్య గుడిసెల్లో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరం

సికింద్రాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ మడ్‌ఫోర్టులోని ఉత్తరయ్య గుడిసెల్లో బుధవారం జనహిత సేవాట్రస్ట్, ఆశ్రిత రెయిన్ బో కమ్యూనిటీ కేర్, కిమ్స్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 240 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందచేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లు అందచేశారు. ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్ ఒంటి నొప్పులు ఉన్నవారికి ఎక్సర్‌సైజ్‌లు గురించి44 తెలిపారు. తిరుమలగిరి మండల ఆర్ఐ సునీల్, లింగాని ఉత్తరయ్య, నర్సింహమూర్తి, శివరామకృష్ణ, శివమ్మ, నగ్మా, శారద, అనిత, బి.నర్సింగ్‌రావు, జే.విక్రమ్ పాల్గొన్నారు.


పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

బదరీ నారాయణ స్వామివారి 71వ తిరునక్షత్ర మహోత్సవం

రాంగోపాల్‌పేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బదరీ నారాయణ స్వామివారి 71వ తిరునక్షత్ర మహోత్సవం, అష్టాక్షరి మహాయజ్ఞం భక్తి ప్రపత్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో బదరి నారాయణ తిరు నక్షత్ర భక్తబృందం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఎంతో నిష్ఠగా వేదమంత్రాల నడుమ నిర్వహించిన 71వ తిరునక్షత్ర మహోత్సవం, అష్టాక్షరి మహాయజ్ఞం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా భక్తబృందం అధ్యక్షులు బొజ్జా నరేష్, కార్యదర్శి మంచికంటి ప్రకాష్, కోశాధికారి జెక్కాని సంతోష్, ఉపాధ్యక్షులు జెక్కాని శ్రీమన్నారాయణ, జెక్కాని శ్రీనివాస్‌లు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కాగా ఈ పూర్ణాహుతికి వైటీడీ స్వర్ణగిరి దేవస్థాన వ్యవస్థాపకులు మానేపల్లి రామారావు, లక్ష్మీనారాయణ దేవస్థాన ఆలయ అనువంశిక ధర్మకర్త గుమిడెల్లి రవీందర్, సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారిలతో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొని అనంతరం నిర్వహించిన గోష్ఠిలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కళశాల

సంగీత గాత్ర, వాయిద్య, నృత్యాల్లో ఉచితశిక్షణ

శ్రీ భక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల



కాలేజీ భవనం

చిలకలగూడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీత, గాత్ర, వాద్యాల పరిరక్షణలో భాగంగా సికింద్రాబాద్‌లో రామ భక్తుడు భక్త రామదాసు పేరిట శ్రీభక్త రామదాసు ప్రభుత్వం సంగీత, నృత్య కళాశాలను ఏర్పాటు చేసింది. పన్నెండుమంది విద్యార్థులతో సంగీత పాఠశాలగా ప్రారంభమై అంచెలంచెలుగా ఎదుగుతోంది. 1966లో కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంఛనంగా ఆరంభించి ఆయన గాత్ర కచేరీతో మొదలైంది. మొదటి ప్రిన్సిపాల్‌గా నూకల చిన సత్యనారాయణ, అనంతరం కర్ణాటక సంగీత విద్వాంసురాలు శ్రీరంగం గోపాలరత్నం తదితరుల సారథ్యంలో 1983 మార్చి 18న సిల్వర్ జూబ్లీ వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు.

నిష్ణాతులైన లెక్చరర్లు, కావలసినన్ని సంగీత వాద్య పరికరాలతో విద్యార్థులు ఎటువంటి వాద్య పరికరాలు వెంట తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడ అన్ని సదుపాయాలున్నాయి. అలాగే సంగీత, నృత్య శాస్త్ర గ్రంథాలు, పుస్తకాలు అందుబాటులో వున్నాయి.

తక్కువ ఖర్చుతో శిక్షణ

కర్ణాటక, హిందూస్తానీ గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం, తబలా, కూచిపూడి, భరతనాట్యం, పేరిణి నృత్యాల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్, డిప్లొమా అందజేస్తారు. సర్టిఫికెట్ కోర్సుకు ఫీజు రూ.1100, డిప్లొమాకు రూ.1500. విద్యార్థులు తమ వెంట ఎటువంటి సంగీత వాద్య పరికరాలు తీసుకురావాల్సిన అవసరం లేదు.

ఉత్సవాలు

కళాశాల విద్యార్థులతో సంగీత గాత్ర కచేరీలు, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించి వారిలో ఉన్న సృజనాత్మకత వెలికితీసి ప్రోత్సహించటానికి తగు చర్యలు తీసుకుంటున్నారు. త్యాగరాజ ఆరాధన పురస్కరించుకుని క్రమం తప్పకుండా నగరంలోని సంగీత కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపాల్స్‌తో కలిసి పంచరత్న కీర్తనల గాత్ర, వాద్య గోష్ఠిలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు.


సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాల మురళీకృష్ణ

ఇండియన్ ఐడల్

జాతీయస్థాయిలో నిర్వహించిన పాటల పోటీల్లో చక్కని ప్రతిభతో ఇండియన్ ఐడల్‌గా నిలిచిన షైనం పాటి శ్రీరామచంద్ర ఈ కళాశాల విద్యార్థే. కర్ణాటక సంగీతంలో ఇక్కడే శిక్షణ తీసుకుని సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాడు. విద్యా సంవత్సరాన్ని మార్చి, శాశ్వత భవనం ఏర్పాటు చేసి, విద్యార్థులకి బస్ పాస్ వంటి సౌకర్యాలు కల్పిస్తే అడ్మిషన్లు పెరిగి, మరింతమంది సంగీత, వాద్య, నృత్య కళాకారులుగా మారే అవకాశముంది.

అందుబాటులో వాద్య పరికరాలు

వయోలిన్ వాద్యంలో రెండో సంవత్సరం చదువుతున్నాను. కాలేజీలో చాలా వయోలిన్లు అందుబాటులో ఉన్నాయి. అతి తక్కువ ఫీజుతో చక్కని శిక్షణ ఇస్తున్నారు.

- పెర్సీ(వయోలిన్ విద్యార్థి)

విద్యా సంవత్సరం మార్చాలి



శ్రీరంగం గోపాలరత్నం ప్రిన్సిపల్‌గా ఉన్న హయాంలో కర్ణాటక గాత్రం నేర్చుకున్నా. సంగీతం వగైరా నేర్చుకోవటానికి వచ్చేవారు దాదాపుగా ఇంజనీరింగ్, ఇంటర్, పదవ తరగతి వంటివి చదువుతున్నవారే. దీని వల్ల చదువుకునే కాలేజి, బడి, సంగీత కళాశాల పరీక్షలు క్లాష్ అవుతుంటాయి. విద్యా సంవత్సరాన్ని మార్చి నుంచి జనవరికి మారిస్తే నేర్చుకునేవారికి అనుకూలంగా వుంటుంది.

- అరుణ కుమారి(మాజీ విద్యార్థి)


గాత్ర కచేరీలో విద్యార్థులు

పనిచేయని సిగ్నల్స్.. ట్రాఫిక్ జామ్


బోయినపల్లి మార్కెట్ యార్డ్ వద్ద సిగ్నల్స్ పని చేయకపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

బోయినపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయినపల్లి మార్కెట్ యార్డ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని నెలలుగా పని చేయడం లేదు. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ పని చేయక నిరుపయోగంగా మారాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దేశంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డ్ నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. దీనికి తోడు తిరుమలగిరి జాతీయ రహదారికి వెళ్లడానికి ఈ సిగ్నల్ నుంచే వెళ్ళాలి. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణ లేక సిగ్నళ్లు పని చేయక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్కెట్ యార్డ్ అధికారులు ట్రాఫిక్ పోలీసులు అధికారులతో చర్చించి ట్రాఫిక్ సిగ్నళ్లతో పాటు, ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జాకాకుండా చర్యలు తీసుకోండి


ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన బ్రాహ్మణసంఘాలు

మల్కాజిగిరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడి ప్రజా అవసరాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనూచౌదరిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలని, పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఎమ్మెల్యే నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజలతో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, లైబ్రరీలకు నిధులు ఉన్నాయని, వీటికి స్థలాలు కేటాయిస్తే జీహెచ్ఎంసీ ద్వారా యూపీహెచ్‌సీలు నిర్మాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం కోసం స్థలం, ముస్లిం, క్రిస్టియన్ల శ్మశానవాటికలకు స్థలం కేటాయించాలని కోరారు. జీఓ 58, 59 ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి వారివారి స్థలాలను రెగ్యులరైజ్ చేయడంతో పాటు తదితర సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు నందప్రసాద్, రుద్రవీణ బాల సుబ్రహ్మణ్యం, ప్రియతం రామకృష్ణ, సూర్యకుమారి, శిరీష, శైలజలతో పాటు బీఆర్ఎస్ నాయకులు అనిల్‌కిశోర్, కార్పొరేటర్ మేకల సునీత యాదవ్, తోట నరేందర్‌రెడ్డి, డోలి రమేష్, చిన్నాయాదవ్, పలువురు బస్తీవాసులు పాల్గొన్నారు.

శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో తీవ్ర మురుగు సమస్య

● స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా, జీహెచ్ఎంసీ

● కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద నాలా పూడిపోయినట్లు గుర్తించిన అధికారులు


శ్యామ్‌లాల్ బిల్డింగ్ నాలాలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా మురుగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తాత్కాలికంగా చర్యలు తీసుకున్నా సమస్య తీరడం లేదు. దీంతో ఇటీవల ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నేత అమరం శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు స్థానికులు ఇటీవల జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో బుధవారం హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించారు. ఎగువ నుంచి వచ్చే వర్షంనీరు, డ్రైనేజీ నీరు గణేశ్ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న నాలాలో కలుస్తోంది. ఈ నాలా పూర్తిగా మూయడంతో అధికారులు ఎక్స్‌కవేటర్ ద్వారా రెండుచోట్ల నాలా పై భాగాన్ని తొలగించి లోపల మట్టి, రాళ్లను తొలగించారు. అయినా, నీరు వెళ్లక పోవడంతో ఈ నీరు వెళ్లే సమీపంలోని కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉన్న ఔట్‌లెట్‌లు పూర్తిగా మట్టితో నిండి ఉండడంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక పోవడంతో వెనకకు వస్తుందని గ్రహించారు. ఇక్కడ నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్యాంటలూన్స్ నాలాలోకి వెళ్తుంది. కోచార్ అపార్ట్‌మెంట్ వద్ద నాలాలో పూడిక పేరుకుపోవడం గుర్తించిన అధికారులు సమస్యను ఉన్నతాధికారులకు వివరించారు. ఇక్కడ వాటర్ పైపులైన్ ఉండడంతో పాటు 11కేవీ విద్యుత్ కేబుల్స్ ఉన్నాయని గుర్తించారు. ఆయా విభాగాల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నట్లు డీఈ మహేష్ తెలిపారు. గణేశ్ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న నాలాలో భారీగా పూడిక చేరిందని, దీనికితోడు ఈ అపార్ట్‌మెంట్ వద్ద పూర్తిగా మూసుకుపోవడంతో నీరు వెళ్లే వీలులేకుండా పోయిందని ఆయన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు అమరం శ్రీనివాస్ రెడ్డి, రమేష్, హసిటోచర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్ ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. ఆపార్ట్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడారు. నాలాలో పేరుకుపోయిన పూడికతీతకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు అందించాలి

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ డివిజన్ హరిగేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, వెంటనే తాగునీరు అందించాలని మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించగా పాఠశాలలో తాగునీరు లేదని విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ట్యాంకర్ ద్వారా నీరు అందించాలని విజ్ఞప్తి చేయగా అధికారులు సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా మహేష్ యాదవ్ పేర్కొన్నారు.

బాక్సింగ్‌లో దీప్తి యాదవ్‌కు బంగారు పతకం


కోచ్ ఓంకారనాథ్ యాదవ్‌తో బంగారు పతకం గెలుచుకున్న దీప్తి యాదవ్

ఎర్రగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ పోటీలో ఎర్రగడ్డకు చెందిన దీప్తి యాదవ్‌కు బంగారు పతకం లభించింది. ఈ సందర్భంగా ఆమె తండ్రి శివకుమార్ యాదవ్ ఎర్రగడ్డలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అండర్-15 సబ్ జూనియర్స్ స్టేట్ లెవెల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ మధ్య షేక్ పేటలో జరిగాయి. 33 నుంచి 35 కిలోల విభాగంలో 13 సంవత్సరాల కె. దీప్తి యాదవ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఆగస్టు 6 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నమిడాలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు దీప్తి ఎంపికయ్యారు. ఎల్బీ స్టేడియంలోని బాక్సింగ్ శిక్షణ శిబిరంలో కోచ్ ఓంకారనాథ్ యాదవ్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ బి.శంకర్‌లాల్ నగర్ వాసులు దీప్తి యాదవ్‌ను సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బేగంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపైన వెళ్తున్న వారిని వెనక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో కిందపడిన వారిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన మనోజ్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 13వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో విధులు ముగించుకొని స్నేహితురాలు రుబియాతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ప్యారడైజ్ వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. వెనక కూర్చున్న రుబియాకు బలమైన గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన బైక్ నెంబర్ ఆధారంగా సదరు వ్యక్తికి ఫోన్ చేయగా ఆస్పత్రి ఖర్చులు భరిస్తానని చెప్పాడు. తీరా డిశ్చార్జి అయ్యేటప్పుడు ఫోన్ చేయగా నా వల్ల కాదని చెప్పడంతో మంగళవారం రాత్రి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆలయ హుండీల లెక్కింపు

సికింద్రాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయ హుండీల లెక్కింపు గురువారం జరగనున్నదని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆషాఢ జాతర హుండీలను దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఫౌండర్ కుటుంబ సభ్యులు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్టు ఆయన వెల్లడించారు.


అఖిలపక్ష నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ డాకూనాయక్

ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలి

సికింద్రాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కొత్త ఓటర్ల జాబితాకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ డాకూనాయక్ కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గపు కొత్త ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని, కొత్తగా పేర్లు నమోదు చేయడం, ఇళ్లు మారిన వారి పేర్లు తొలగించడం, మార్పులు, చేర్పులు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఒకే ఇంటిలో నివసిస్తున్న వారంతా ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలింగ్ బూత్‌లలో వికలాంగులకు ప్రత్యేక సదుపాయం కల్పిస్తామని చెప్పారు. బేగంపేట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ రాజ్‌కుమార్, నాయకులు దయానంద్, సందీప్‌వర్మ, ఆకుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ తదితరులు

ఐక్య బీసీ ఉద్యమంలో పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలి

తార్నాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై తలపెట్టిన ఐక్య బీసీ ఉద్యమ నిర్మాణంలో పార్టీలకతీతంగా భాగస్వామ్యం కావాలని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు కలిసి రావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు అయితే బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం మెజార్టీ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా వ్యవరించడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీ రిజర్వేషన్లను ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయాలని రాష్ట్రం మరొకసారి ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చి గవర్నర్‌కు పంపించినప్పటికి, గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడంతో బీసీ రిజర్వేషన్ల అంశం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై పార్టీలకతీతంగా ఐక్య బీసీ ఉద్యమ నిర్మాణంలో పాలుపంచుకుని రిజర్వేషన్ల సాధించాలని పిలుపునిచ్చారు.

గౌరీ శంకర ఆలయ హుండీ లెక్కింపు

ముషీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని గౌరీ శంకర ఆలయ హుండీ కానుకలను బుధవారం ఆలయ ఈఓ శ్రీనివాస్‌లు, ఇన్‌స్పెక్టర్ ఆండాలు పర్యవేక్షణలో లెక్కించారు. మూడు నెలలకు గాను 13 గ్రాముల బంగారం, 5 తులాల వెండి, రూ.30,213 నగదు వచ్చాయని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌చారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సర్వేశ్వర్, భరత్‌శర్మ, కృపాకర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.